పోలీసులు x పందెం రాయుళ్లు

- కోడిపందేలు, జూదాల నియంత్రణ సాధ్యమేనా?
- ఉదయం బరులు ధ్వంసం సాయంత్రానికి మళ్లీ మామూలే
- గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీస్థాయిలో బరులు
- నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 18 బరులు
- పంపకాలు చేసుకున్న టీడీపీ, జనసేన నాయకులు





అవనిగడ్డలో కోడిపందేల బరులను ధ్వంసం చేస్తున్న పోలీసులు

అవనిగడ్డ: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అవనిగడ్డ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున కోడిపందేలు, జూదాల కోసం బరులు సిద్ధం చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 18 చోట్ల బరుల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. టీడీపీ, జనసేన నేతలు బరులను పంచుకుని సన్నాహాలు చేస్తున్నారు. అవనిగడ్డ, ఘంటసాలలో పోలీసులు బరులను ధ్వంసం చేస్తున్నారు. అయితే మళ్లీ బరులు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకుంటారా? నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి పండుగ మూడు రోజులు వదిలేస్తారా అన్నది వేచి చూడాలి.



సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న రమ్మీ గేమ్ పోస్టర్

అవనిగడ్డలో బరులు ధ్వంసం చేసిన పోలీసులు

అవనిగడ్డ మండలంలో అవనిగడ్డ, పులిగడ్డ, ఎడ్లంక గ్రామాల్లో కోడిపందేలు, పేకాట బరులు ఏర్పాటు చేశారు. ఈ బరుల్లో చుట్టూ ఇనుప ఫెన్సింగ్‌తో పాటు సిమెంట్ స్తంభాలు పాతి భారీ ఎత్తున టెంట్లు ఏర్పాటు చేశారు. అవనిగడ్డ సీఐ యువకుమార్, ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో బరులను ధ్వంసం చేశారు. చదును చేసిన బరులను పొక్లెయిన్‌లు, ట్రాక్టర్లతో దున్నించేశారు. ఇనుప కంచెను ధ్వంసం చేసి సిమెంట్ పోల్స్‌ని కూడా పడగొట్టారు. టెంట్‌లను తొలగించి పోలీస్ స్టేషన్‌కు చేర్చారు. బరుల నిర్వాహకులు ఓ యువనేతకు ఫోన్‌చేసి పోలీసు చర్యలను ఆపించాలని కోరినట్లు సమాచారం. పండుగ పేరుచెప్పి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ యువకుమార్, ఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. ఘంటసాల మండలం కొడాలి, లంకపల్లిలో ఏర్పాటు చేసిన బరులను ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు.

ఉదయం తొలగించారు.. సాయంత్రం మళ్లీ వేసేశారు

ఆదివారం ఉదయం సీఐ యువకుమార్, ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బరులను ధ్వంసం చేయగా సాయంత్రం మళ్లీ యథావిధిగా బరులను ఏర్పాటు చేశారు. తొలగించిన ప్రాంతంలో టెంట్లు, పోల్స్ పాతి బరులను సిద్ధం చేశారు.

పెద్ద ఎత్తున జూదం బరుల ఏర్పాటు

సంక్రాంతి పండుగ పేరుతో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున పేకాట బరులు సిద్ధం చేస్తున్నారు. కోడిపందేల బరులు ఎక్కువ కావడం, పోలీసులు ధ్వంసం చేయడం వల్ల కొంతమంది జూదం బరులకు మొగ్గు చూపుతున్నారు. అవనిగడ్డ మండలం పులిగడ్డ టోల్‌ప్లాజా వద్ద రమ్మీ పూల్ గేమ్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు హల్‌చల్ చేస్తున్నాయి. ఒక్క రోజు మాత్రమే ఉండే ఈ ఆటలో మొదటి బహుమతి బుల్లెట్, రెండవ బహుమతి లేడీస్ బైక్‌తో పాటు ప్రతి సభ్యునికి ఒక బహుమతి ఉంటుందని ప్రకటించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గంలో కోడిపందేలు, జూదం బరులు ఏర్పాటు చేయడంతో కూటమి ప్రభుత్వమా.. మజాకా... అంటూ ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

పోలీసుల హై డ్రామా



మూడు రోజుల కిందట పోలీసులు సిమెంట్ దిమ్మలు తొలగించినా మళ్లీ ముస్తాబైన పల్లోటి హైస్కూలు వెనుక బరి

పెడన: ఓ పక్క కోడి పందేల నిర్వాహకులు బరులను సిద్ధం చేస్తున్నారు. మరో పక్క పోలీసులు దాడులు చేసి సిమెంటు దిమ్మెలను పీకి పక్కన పడేస్తున్నారు. అయితే ఇదంతా పోలీసులు చేస్తున్న హై డ్రామా అని, కోడిపందేలపై ఇటీవల హైకోర్టు సీరియస్ అయిన నేపథ్యంలో తమ తప్పేమీ లేదన్నట్టుగా, తమ విధులు తాము సక్రమంగా నిర్వర్తిస్తున్నామని చెప్పుకోవడానికే పోలీసులు ఈ ధ్వంసాల నాటకం ఆడుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎందుకంటే... పోలీసులు తాము పీకేసిన షామియానాలు, సిమెంటు దిమ్మెలు, ఐరన్ ఫెన్సింగ్‌లను స్వాధీనం చేసుకుని సీజ్ చేయలేదు. అక్కడే వదిలేయడంతో నిర్వాహకులు పోలీసులు అటు వెళ్లగానే ఇటు యథావిధిగా వాటిని మళ్లీ ఏర్పాటు చేసుకోవడం ఈ అనుమానాలకు తావిస్తోంది. పెడన మండలంలో పెద్ద బరులున్నా చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే కొంకేపూడి రైస్ మిల్లు పక్కనే పెద్ద బరి ఏర్పాటు చేశారు. పెడన ఎమ్మెల్యే కటౌట్‌లు, మండల స్థాయి నాయకులు బ్యానర్లు భారీ స్థాయిలో ఏర్పాటు చేయడమే కాకుండా లైటింగ్‌లు ఏర్పాటు చేయడం విశేషం. పల్లోటి స్కూలు వెనుక బరి వద్ద కూడా ఇదే పరిస్థితి. రాత్రి సమయంలో సైతం లైట్లు జిగేలుమంటున్నా...పోలీసుల కళ్లకు కనపడడం లేదేమో మరి...మరో పక్క తహసీల్దారు కార్యాలయానికి కూతవేటు దూరంలో జనసేన నాయకుడి ఇంటి వెనుక పెద్ద బరిని ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ బరులను ఏర్పాటు చేయడం గమనార్హం. కొంకేపూడిలో ఏకంగా ట్రయిల్‌రన్ నిర్వహించడంతో పందెం రాయుళ్లు పోటీ పడ్డారు.

కొడాలిలో కోడిపందేల బరులు ధ్వంసం



కొడాలిలో కోడిపందాల బరిని జేసీబీతో తవ్విస్తున్న ఎస్ఐ ప్రతాప్ రెడ్డి

కొడాలి(ఘంటసాల): సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఘంటసాల ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి అన్నారు. ఘంటసాల మండలంలోని కొడాలి, లంకపల్లి గ్రామాల్లో కూటమి నేతల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోడిపందేల బరులను పోలీసు సిబ్బందితో కలసి ఎస్ఐ ప్రతాప్‌రె రెడ్డి ఆదివారం ధ్వంసం చేశారు. పందేలు నిర్వహించే స్థలాల్లో జేసీబీ సాయంతో తవ్వించడం, ట్రాక్టర్‌తో దుక్కి దున్నించడంతో పాటు సిమెంటు స్తంభాలు, షామియానాలను తొలగించారు. మండలంలో ఎక్కడైనా అక్రమంగా కోడిపందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

క్లుప్తంగా

వైభవంగా భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణం



నాగాయలంక: స్థానిక శ్రీరుక్మిణీ శ్రీసత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానం ప్రాంగణంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా ఆదివారం స్థానిక సంకర్షణ భజన మండలి, గీతాసమాజం మహిళలతో భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణం వైభవంగా జరిగింది. మండలి అధ్యక్షురాలు చిట్టా వాణి నేతృత్వంలో సామూహికంగా పారాయణం గావించారు. తొలుత ఆలయ అర్చకుడు బ్రహ్మశ్రీ డీవీకే సత్యప్రసాద్ బ్రహ్మత్వంలో శాస్త్రోక్తంగా గోదాదేవి విశేష పూజలో మహిళలు పాల్గొన్నారు. శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి మూల విరాట్టులకు, గోదాదేవి పీఠం వద్ద విశేష పూజ, అలంకారం జరిపారు. మంత్ర పుష్ప నీరాజనాలు సమర్పించిన అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. గీతా సమాజం సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



కోడూరు: లెజెండ్స్ సోషల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సర్వీసెస్ స్థాపించి 22 సంవత్సరాలు పూర్తి కావడంతో స్థానిక వెంకటేశ్వర థియేటర్ ఖాళీ స్థలంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కోడూరు ఎస్ఐ చాణిక్య శిబిరాన్ని ప్రారంభించారు. మచిలీపట్నం ప్రభుత్వ జనరల్ వైద్యశాల బ్లడ్ బ్యాంక్ వైద్యులు యువత వద్ద నుంచి రక్తాన్ని సేకరించారు. శిబిరంలో 90 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాతలకు సర్వీసెస్ ఆధ్వర్యంలో జ్ఞాపిక, సర్టిఫికెట్‌ను అందించారు. సర్వీసెస్ సభ్యులు పూతబోయిన రామారావు, సిద్ధినేని భారతరావు, అన్నం యోగానంద్, అవనిగడ్డ సాయి, బండే కిషోర్, సిద్ధినేని సాయిగోపాల్, బడే నాని, మాచర్ల నారాయణ పాల్గొన్నారు.

మినీ గోకులాలు పాడి రైతులకు వరం



పెడన: మినీ గోకులాల షెడ్లు పాడి రైతులకు వరమని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని నడుపూరులో ఉపాధి హామీ పథకం ద్వారా పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన మిని గోకులాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమం కోసం మినీ గోకులాలను ఒక్కొక్కటి రూ.1.85 లక్షలు వెచ్చించి నిర్మిస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు శెలపాటి ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకట నగేష్, ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.జయరామ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పూటీ లాగుడు బలప్రదర్శనకు సర్వం సిద్ధం



ఘంటసాల: సంక్రాంతి పండుగ సందర్భంగా ఘంటసాలలో ఏర్పాటు చేసిన ఒంగోలు జాతి వృషభముల నాటుబండి పోలు రాధాడి పూటీ లాగుడు బల ప్రదర్శనకు సర్వం సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఘంటసాల హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగే ఈ ప్రదర్శనకు ప్రాంగణం చుట్టూ మెస్ ఏర్పాటు చేయడంతో పాటు రంగుల జెండాలను అలంకరించడంతో ఆకర్షణీయంగా ఉంది.సోమవారం ఉదయం 10 గంటలకు పోటీలను ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు ప్రారంభిస్తారన్నారు.

మాజీ సర్పంచ్ తురక మంగమ్మ మృతి

మోపిదేవిలంక(మోపిదేవి): మండల పరిధిలోని మోపిదేవిలంక గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకురాలు తురక మంగమ్మ(85) ఆదివారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె 2013-18 మధ్య సర్పంచ్‌గా పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ మోర్ల జ్యోత్స్న, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, మండల బీసీ సెల్ కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరరావు మంగమ్మ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

అమితమైన జ్ఞాన సంపన్నుడు వివేకానందుడు



వివేకానందుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ వెంకట్రావ్, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

పెడన: పట్టణంలోని భట్ల జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పెడన శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మానవత సంస్థ పెడన శాఖ అధ్యక్షుడు మట్టా రాధాకృష్ణమూర్తి, పాఠశాల హెచ్‌ఎం అద్దంకి అశోక్ కుమార్ తదితరులు మాట్లాడుతూ శ్రీ స్వామి వివేకానంద అందించిన సూక్తులు అన్ని రంగాల్లోని అన్ని వయస్సుల వారు ఆచరించదగిన విధంగా ఉంటాయన్నారు. సంస్థ ప్రతినిధులు వూటుకూరి సుబ్బారావు, కాగిత శంకర సాంబశివరావు, పేరక రవికుమార్, బెల్లంకొండ లక్ష్మణ్, కొట్టే కోటేశ్వరరావు, భట్ల మోహిని దుర్గా శంకర్, యార్లగడ్డ దుర్గాభవాని పాల్గొన్నారు.

వివేకానంద హైస్కూలులో ...

పట్టణంలోని శ్రీ వివేకానంద హైస్కూల్‌లో పాఠశాల హెచ్‌ఎం కేడీఎస్‌వీ ప్రభాకర్ ఆదివారం స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో సంక్రాంతి సంబరాలను నిర్వహించి ఎల్‌కేజీ యూకేజీ చిన్నారులకు భోగి పండ్లు పోశారు.

అమితమైన జ్ఞాన సంపన్నుడు వివేకానందుడు

అవనిగడ్డ: వివేకానందుడు అమితమైన జ్ఞాన సంపన్నుడని, ఆయన జీవితం యువతకు ఆదర్శనీయమని విద్యావేత్త, ఎన్ఆర్ఐ ప్రొఫెసర్ మూల్పూరి వెంకట్రావ్ అన్నారు. స్థానిక గాంధీక్షేత్రంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విద్యావేత్త వెంకట్రావ్ మాట్లాడుతూ యువత వివేకానందుడి స్ఫూర్తితో పయనిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ జాతిని సమున్నతంగా తీర్చిదిద్దేలా వివేకానందుడు బోధనలు అందించారని చెప్పారు. తొలుత అతిథులు వివేకానందుని విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రచయిత వేమూరి రాజేష్‌తో పాటు పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



40 ఏళ్ల తర్వాత కలుసుకున్న జైహింద్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు



పెదతుమ్మిడిలో ఆదివారం కలుసుకున్న 2005-06 బ్యాచ్ పూర్వవిద్యార్థులు



పెడన సాయిబాబా హైస్కూల్ 1998-99 పదో తరగతి పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

మచిలీపట్నం జైహింద్ హైస్కూల్ 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు40 ఏళ్ల తర్వాత, పెడన సాయిబాబా హైస్కూల్ 1998-99 బ్యాచ్ విద్యార్థులు 26 ఏళ్ల తర్వాత, బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి హైస్కూలు 2004-06 బ్యాచ్ విద్యార్థులు కూడా ఆదివారం కలుసుకున్నారు.

-సాక్షి నెట్‌వర్క్

నగరంలో త్రీకే రన్

మచిలీపట్నంటౌన్: నగరంలో ఆదివారం ఉదయం వీర్నాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్రీకే రన్ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ సెంటర్ నుంచి కోనేరుసెంటర్ వరకూ ఈ రన్ సాగింది. రన్‌లో పాల్గొన్న 25 మందికి రూ.5 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతి చెక్‌లను ఎంపీ వల్లభనేని బాలశౌరి అందజేశారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, నిర్వాహకుడు వి.బాలాజీ రన్‌లో పాల్గొన్నారు.

అన్ని వర్గాల సమానత్వమే అంబేడ్కర్ ఆశయం

- శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు
- పర్ణశాలలో పండుగ వాతావరణంలో బాబాసాహెబ్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు

గూడూరు: మండలంలోని తరకటూరు శివారు పర్ణశాలలో నిర్మించిన 15 అడుగుల బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో అన్ని వర్గాల ప్రజలు సమానంగా ఉండాలన్నదే అంబేడ్కర్ ఆశయమన్నారు. అంబేద్కర్‌ను ఒక కులానికి, వర్గానికి పరిమితం చేసే కుట్ర జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ బాబా సాహెబ్ రాసిన రాజ్యాంగం కారణంగానే తనవంటి వెనుకబడిన వర్గాల వారికి పదవులు దక్కాయన్నారు. మచిలీపట్నంలోని అంబేడ్కర్ భవన్ పునర్నిర్మాణానికి రూ.24 కోట్లతో ప్రణాళికలు రూపొందించామన్నారు. సమావేశానికి విశ్రాంత అధ్యాపకుడు కనిగంటి భాస్కరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య, జనసేన నాయకుడు బండి రామకృష్ణ, ఐపీఎస్ అధికారి మోకా సత్తిబాబు, ఎంపిటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, సర్పంచి చిన్నం వెంకట రమణమ్మ, కైలా బాలకృష్ణ, వేము కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల కోలాహలం



మోపిదేవి: రాష్ట్రంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కోలాహలంగా మారింది. ఆలయ ప్రాంగణం ఎటు చూసినా భక్తజనంతో నిండిపోయింది. తెల్లవారుజామునుంచే భక్తులతో క్యూలైన్లన్నీ నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లివృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ డీసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవస్థానం ఎదుట ప్రధాన రహదారులకు ఇరువైపులా భక్తుల వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వచ్చింది.

వైభవంగా శ్రీవేణుగోపాల స్వామి గ్రామోత్సవం

పెడన: పట్టణంలో ఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానంలోని ఉత్సవమూర్తికి ఆదివారం సాయంత్రం అత్యంత భక్తి శ్రద్ధలతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. మహిళా భక్తుల కోలాట భజనలతో పురవీధుల్లో స్వామి వారి ఊరేగింపు జరిగింది. ఆలయ అర్చక స్వామి అగ్నిహోత్రం హరికృష్ణ స్వామి వారికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించిన పిమ్మట గ్రామోత్సవానికి బయలుదేరారు. ఆలయ అభివృద్ధి కమిటీ, ఆలయ ఈవో పర్యవేక్షణలో గ్రామోత్సవాన్ని వైభవంగా జరిపారు.

నేడు ఆరుద్రోత్సవం

మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో ఈ నెల 13వ తేదీ సోమవారం ఉదయం 7 గంటలకు ఆరుద్రోత్సవం (శివ ముక్కోటి) సందర్భంగా స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ డీసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. అందులో భాగంగా ఉదయం 7.30 గంటలకు మహా నివేదన జరుగుతుందని, అనంతరం శేష వాహనంపై రావివారిపాలెం వరకు గ్రామోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానంలో జరిగే ఆర్జిత సేవలు తాత్కాలికంగా నిలిపివేస్తారని వివరించారు.

పెదకళ్లేపల్లిలో ధనుర్మాస ఆరుద్రోత్సవం

దక్షిణ కాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లిలో ఉన్న శ్రీ దుర్గాపార్వతీ సమేత శ్రీనాగేశ్వర స్వామి వారి దేవస్థానంలో సోమవారం ధనుర్మాస ఆరుద్రోత్సవం, పౌర్ణమి, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా తెల్లవారుజామున శ్రీదుర్గాపార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారికి విశేష రుద్రాభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చనలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ డీసీ శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. పూజా కార్యక్రమం అనంతరం రాజాధిరాజ వాహనంపై శ్రీస్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు ప్రత్యక్షంగా పాల్గొని స్వామివారికి జరిగే విశేష అభిషేకాలు తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని సూచించారు.

సంక్షిప్తంగా...

నేడు గోదా రంగనాథుల కల్యాణం

కోడూరు: ధనుర్మాసం ముగింపును పురస్కరించుకుని ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామివారి ఆలయంలో సోమవారం గోదా రంగనాథుల కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామిజీ ఆదివారం తెలిపారు. ఉదయం గోదాదేవి అమ్మవారిని ప్రత్యేక పల్లకీలో ఊరేగించి, తిరుమంజన సేవను నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం గోదారంగనాథుల కల్యాణం, విశేష పూజలు ఉంటాయని తెలిపారు. కోడూరు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి, లింగారెడ్డిపాలెం, ఇస్మాయిల్‌బేగ్‌పేట, బడేవారిపాలెం శ్రీరామమందిరాల్లో కూడా గోదా రంగనాథుల కల్యాణోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



ఘంటసాల: స్వచ్ఛ ఘంటసాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఘంటసాల జలధీశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ పోటీలను ఎన్నారై మూల్పూరి వెంకట్రావు ప్రారంభించారు. ఈ ముగ్గుల పోటీల్లో 50 మంది పైగా మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు. సీనియర్స్ విభాగంలో ముగ్గురు, జూనియర్స్ విభాగంలో ముగ్గురు చొప్పున మొత్తం ఆరుగురు విజేతలకు రైస్ కుక్కర్లు బహుమతిగా అందించారు. సీనియర్స్ విభాగంలో ఎ.జ్యోతి నీలిమ, యు.సాహితి, ఎం.బేబీ వర్షిత, జూనియర్స్ విభాగంలో కె.మహతి, బేబీ వేదర్శి, జె.నాగేశ్వరిలకు బహుమతులు లభించాయి. విజేతలకు ఎన్నారై వెంకట్రావు చేతుల మీదగా బహుమతులు అందించారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

మేళ్లమర్తిలంక(మోపిదేవి): మండల పరిధిలోని మేళ్లమర్తిలంకలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతిగా గుడివాక లతాశ్రీ, మాదాసు కమలారాణి రూ. 3 వేలు నగదు బహుమతి అందుకున్నారు. ద్వితీయ బహుమతిగా వల్లు జయశ్రీ, మండలి రచన రూ.2 వేలు, మూడో బహుమతి తోట రేష్మ, దీప్తి రూ. వెయ్యి, నాల్గో బహుమతి తోట కీర్తి, జ్యోషిత రూ.500, ఐదో బహుమతిగా తోట మానస, దివ్య రూ.500 గెలుచుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలకు న్యాయమూర్తులుగా ఉత్తర చిరువోలులంక ఎంపీటీసీ సభ్యురాలు నడకుదుటి జననీకుమారి, స్థానిక ఏఎన్ఎం లంకా నాగలక్ష్మి, డ్వాక్రా బుక్‌కీపర్ కొలసాని లావణ్య వ్యవహరించగా ముఖ్య అతిథులుగా నడకుదుటి జనార్ధనరావు, బండారు బాబూరావు, రాఘవ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

సోమవారం జరిగే ప్రజా సమస్యల వేదిక రద్దు

కోనేరుసెంటర్: కృష్ణాజిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం)ను ఈ సోమవారం రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సోమవారం సెలవు కావటంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అర్జీదారులు సహకరించాలని కోరారు.

స్వచ్ఛ రాయవరమే లక్ష్యం

గూడూరు: స్వచ్ఛ రాయవరమే లక్ష్యంగా పారిశుద్ధ్య కార్మికులు పనిచేయాలని సర్పంచి నందం మల్లీశ్వరి కోరారు. పంచాయతీ నిధులతో గ్రామానికి కొత్తగా సమకూర్చిన మూడు రిక్షాలను ఆదివారం సర్పంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను ఆమె బహూకరించారు.